# ★ మనస్తత్వాలు ★

శ్రీ కొంపల్లి బ్రహ్మానందరావు.

"పాలడబ్బా అయిపోయింది. ఆఫీసునుంచి వచ్చేటప్పుడు బజారుకెళ్ళి కొనుక్కురండి" అంది భార్య ఆఫీసుకెళ్తూన్న రంగాన్ని.

"మొన్ననేగా తెచ్చింది!" కొద్ది కోపంతోనే అన్నాడు.

"అవును" అని వూరుకుంది.

"ఊహూ! అప్పుడే అయిపోయిందని చెపుతున్నావు, కారణం దొరక లేదు కాబోలు!"

"బాగుంది. నే నేమయినా మింగుతున్నానా? రవ్వంత డబ్బా ఎన్నాళ్ళు వస్తుందని!"

"ఏమో! తల తాకట్టు పోతోంది ఈ పాలడబ్బా ఖర్చుతో! ఉన్నది ఒక్క సంతానం! పాలడబ్బాలకు మితంలేదు..." గొణుగుకుంటూ గడప దిగి వెళ్ళిపోయాడు

రాజ్యం భర్త పరిస్థితి అవగాహనం చేసుకుంది. పాలడబ్బా కొనుక్కొచ్చి నాలుగు రోజులైంది. మూడేండ్లు వయస్సుగల పిల్లకు పాలడబ్బా ఎన్నాళ్ళు వస్తుంది? వృధాగా పారపొయ్యటానికి తనకు కూడా జ్ఞానంవుంది. తను త్రాగేందుకు... భర్తకు ఆలోచన శూన్యం. కేవలం తన సంపాదనను తినడానిక్కే వచ్చాననుకునే వ్యక్తి. ఇంట్లో కాఫీ పొడి అయిపోతే తెమ్మండం తప్పు. పాలవాడి లెక్క చూడండి అంటే కసరటం. పనిదానికి జీతం ఇవ్వమంటే రెండు చేతులు మొహంమీద పెట్టుకోవడం.

చీరలన్నీ చినిగి తుంపులయిపోయినయి. నా సంగతి కాస్త పట్టించుకోండి" అంటే సమాధానం "నా పెట్టి నిండా పట్టు ధోవతులు అమర్చుకున్నాను. తీసుకుని అలంకరించుకోండి" బట్టలు కొని ఇమ్మనడం ఘోర కృత్యం.

"ఉగాది వస్తోంది. మన చిట్టి తల్లికి చిన్న గౌను కుట్టించండి" అన్నప్పుడు తను ఏమన్నారో తెలుసా, వాళ్ళకున్నది, వాళ్ళమ్మాయికి కుట్టించుకున్నారు. దాన్ని జూసి మనం కూడ అనుసరించాలంటే చాలా కష్టం. ఈ ఓర్వలేని స్వభావాలు కూడని పోతే స్త్రీ జాతికున్న నాశనం తప్పదు.

పండగంటే అందరూ బట్టలు కుట్టించుకుంటారు. ఇంటి పక్క అమ్మాయి మంచి దుస్తులు కొనుక్కొంది. పిన్నిగారూ పిన్నిగారూ! అంటూ తనకు చూపించటానికి వచ్చింది. చాలా బాగున్నాయమ్మా, మా లలితకుకూడా కొంటాను సాయంత్రం! అనడం జరిగింది. అందుకని ఆ పిల్లని చూసి ఓర్వలేకపోవడమా! ఎంత విచిత్రం! నీ కూతురికి నేను బట్టలు కుట్టించండి అనడం ఆ పిల్లను చూసి ఓర్వలేకపోయి......!!"

"పోనీ పండక్కి ఇంటికి పోతాను. నాన్నగారు పదే పదే వ్రాస్తున్నారు. పంపించరూ?"

"ఎపుడు వ్రాసారు?"

"చాలా సార్లు. నిన్న కూడ ఒకటి వచ్చిందిగా?"

"ఇప్పటికి ఎన్నిసార్లు వ్రాశారు?"

"అదేం ప్రశ్న? వచ్చిన ఉత్తరం మీరు చూసే నాకిస్తున్నారుగా!"

"ఏమన్నారు?"

"ఏమంటారు! పండక్కి రమ్మన్నారు ఇద్దర్నీ!"

"నన్నుకూడానా?"

"అవును!"

"అయితే వచ్చి తీసుకెళ్ళకూడదూ!"

"అదేం మాటండి! వాళ్ళకూ అక్కడ బండెడు సంసారం! అమ్మయితే కదల్లేని స్థితి. అదీగాక తమ్ముడికి పరీక్ష సమయాలు. నాన్నగారు ఆఫీసు గొడవలు ఆపీని."

పెళ్ళయి అయిదేండ్లు అయింది. ఇంకా మామగారువచ్చి అల్లుడ్ని బతిమలాడడం అంటే అది విపరీతమైన కోరిక. ఇంకా నల్గురి కూతుళ్ళకు వివాహం చెయ్యవలసిన ఆయన. కేవలం పెద్ద అల్లుడికే అంటే చాల కష్టం. పండక్కి రమ్మని వ్రాసేవారు గానీ ఇంటికొచ్చి తీసుకుపోవడం అంత వయస్సుగల పెద్దాయనకు భారమైన వ్యవహారం! కొత్త అల్లుడిగానే ఎల్లకాలం వుండిపోవాలంటే అతీతమైన ఆశయం!

"ఏమంటారండీ! పంపిస్తారా లేదా?"

"ఇదుగో చూడు. ఈ పండక్కి వేధించకు. మీ నాయనగారిలాగ నాకూ ధనరాశి వుంటే నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు. నాల్గొందల మైళ్ళున్నా విడిచిపెట్టి వచ్చేవాడ్ని. అయినా పండగ ఇక్కడ మటుకు లేసటే పిచ్చిదానా! వీలయితే వచ్చే ఏడు కోరుకో..."

భార్య అంటే భర్తకు అదొక సులకన. తనొక్కడే ఘనుడు అనుకోవడం తప్పులేదు. ఏసీ ఎదయిగా వున్న భార్యకూడ కనీసం మనిషే అని కూడ అనుకోవడం తప్పా. దాదాపు ఇరవయి సంవత్సరాలు పుట్టిన ఇంట్లో తోబుట్టువులతో పెరిగాను. చెల్లాయిలతో కలిసి పెరిగాను. తమ్ముళ్ళతో ఆడుకున్నాను. అందరూ పంక్తిగా కూర్చుని భోజనం చేసేవాళ్ళం! పండగ వస్తోందీ అంటే ఎంతో సరదా పడేవాళ్ళం. నాన్నగారు ఓ చిన్న బట్టలషాపు కొని తెచ్చేవాళ్ళు. ఏది సెలక్టు చేసుకోవాలో అర్థమయేది గాదు. పండగ అంటే ఎంతో ఇదిగా గడిపేవాళ్ళం. ఆడపిల్లలం అని అమ్మ మాకు ఇంకా ఏమేమో చేసేది. ఎంతో తాపత్రయ పడేది. సినిమాలనీ, నాటకాలనీ ఎంతో తియ్యగా గడిచేది దినమంతా. అలాంటి చోటికి తను పోవాలనుకోవడం పిచ్చికోరిక! నేను పిచ్చిదాన్ని. "వచ్చే ఏడు కోరుదికోలి..." ఈ ఏటికి అయింది!! పండగ ఇక్కడా వుంది. అక్కడా వుంది! ఇక్కడ వున్న పండగ కనిపిస్తోందిగా! హుషారులేనిరోజు. చినిగిన బట్టలు. కూతురుకు గౌను ఇవ్వలేని తల్లి చేసుకుంటున్న పండగ!

"ఏమండీ! నేను వూరికి పంపించమని అడగను. అక్కడ క్షేమగూడ. కానీ పాపాయికి గౌను కొనివ్వండి చాలు"

"ఈ పండగ వున్నదే చూశావో లేదో నెల ప్రారంభంలో రాలేదు. మధ్యలో ఏర్పడింది. చేతులో కానీలేదు. బాధపడనవసరంలేదు. మన అమ్మాయికి బట్టలు కొనకపోతే బాధ ఎందుకే పిచ్చి వెధవా! అంతగా అంటే నీ పాత చీరలేదూ. అది చింపి......"

"నమస్కారం ఇహ చాలండీ మీ సలహాలు"

"అయితే అనతలకు దయసెయ్యి. నా బుర్ర వేడెక్కించకు."

ఆయనతో తనుపడే అగచాట్లు చెప్పుకుంటే తీరేవికావు. దాంపత్య జీవితం కలిగివున్న దంపతులుకారు అనుకుంటారు అందరూ! అందకని నోరు మూసుకోవాలి. భర్త మీద భార్యకు అనురాగం ఉండాలట! ఓర్పు అవసరం! ఆఫీసు నుంచి రాగానే ఆనంద సంతోషాలతో స్వాగతం ఇవ్వాలట! కానీ ఆ భార్య స్థితిగతులు చెవికెక్కించుకోటానిక్కి వీలుండదు తనకు! మంచి బట్టలవసరంలేదు. ఆభరణాలు అవసరంలేదు కానీ శుభ్రంగా కనిపించకానిక్కి కొన్ని అవసరం అన్నది గ్రహించరు. పైగాలు కొనుక్కోండి అంటే "మనమేం భోగం వాళ్ళం కాదు" అని కసరడం ఎంత వివేకమో!

ఎంత ఓర్చుకున్నా ఓర్పు కరిగిపోతుంది. "స్త్రీకి ఓర్పే ఆభరణమట" ఓర్పును పరీక్షించాలంటే నెగ్గటం సులభం.

అన్నీ మానుకున్నాను. ఏమీ అవసరం లేదు. ఎలాగో బతుకుతాను నా అదృష్టం ఇంతే అనుకుంటాను. కానీ "తన కూతురుకు పాలడబ్బా తప్పదన్నాను ఏమోమరి..."

◆ ◆ ◆

ఆఫీసరు ముందు కుర్చీలో కూర్చుని గంట పైన అయింది. వర్క తలంతా విచారాలతో నిండి వుంది. ఆలోచనలకు అంతులేదు. ఒడ్డు చేరే దిశలేదు. పాల డబ్బా కొని నాల్గు రోజులయి వుంటుంది. అప్పుడే అప్పుడే హుకుం జారీ! ఛీ...ఛీ స్త్రీలు వివాహం చేసుకోవడం కేవలం మగవాళ్ళను పీడించేందుకే. సందేహంలేదు. నాల్గు రోజులకో పాలడబ్బా అయితే నెలకు..." అవును నాలాంటి డబ్బయి నాలుగు రూపాయల జీతగాడి వ్యయంకాదు అది. సామాన్యుడు కొనే ధరకాదు. కన్నబిడ్డే! అవును. కన్నబిడ్డకే ఇచ్చుకోలేని జీతం! సిగ్గు ఎందుకు!! సిగ్గుపడనవసరంలేదు.

# మనస్తాపం

ఇది ఎలాగుంటే తనకు బిల్లులు. ఏం? నేనే కొని పెట్టకపోతే వాళ్ళమ్మను ఓ పది కొని పంపించమని రాయ కూడదూ! అంత లేక ఏడుస్తున్నారా? ధనవంతులు గాలు తనకే ఆ తాహతు లేకపోతే నాకేమిటి? నాకూతురుకు నేను పెట్టలేకపోయానని నన్ను దుయ్యబట్టకపోతే తన తల్లి తనకు ఏం తెచ్చిందో ప్రశ్నించుకోకూడదూ? పెళ్ళి చేసుకున్నంత మాత్రాన అన్నీ భర్తే భరించుకోవాలా? వివాహం చెయ్యగానే కూతురు కాకపోతుందా? ఖర్చు పెట్టడానికి కూతురు గాదేం? పండక్కి ఇంటికి పంపటానికి మళ్ళీ కూతురుగా రూపొందుతుంది! అహా! ఏమి విచిత్ర వ్యక్తులయ్యా!

పోనీ పంపించాలనే అనుకో! తను వచ్చి ఏమయినా తీసుకెళ్తున్నాడా? అదీ లేదు. ఆ ఖర్చంతా తను భరించ కూడదు. రాను పోను ఎటులేదన్నా అరవయి రూపాయలు అవుతుందని భయమే! దూర భారాలు సంబంధాలు ఇప్పుడు చేటవ్వాడు ముందు ఆలోచనలు చేసి మనస్సులో నిలుపుకోవడం అవసరం.

ఇచ్చే జీతం ఎనభయి కూడా కావు. రోజంతా కూలి వాడి కన్నా బండచాకిరి. ఎదుట వ్యవహారం ఆఫీసరు చేతుల్లో అదమాయింపులు. బెదరింపులు. అబ్బబ్బ మగ వాడి పని రోచ్చు. యమయాతన అనుభవించాలి. ఇంట్లో గదమాయింపులు, బయట కోపాలు, ఆఫీసులో నిష్ఠూరాలు. ఆడదాని జీవితం మేలు. భర్తను వేధించి గడపవచ్చు. ఇంట్లో కుర్చుని మింగొచ్చు. ఒక బాధలేదు. భయంలేదు. చింతలేదు.

అయినా ఆలోచన జ్ఞానం లేని స్త్రీ జీవితం వద్దేమో అనిపిస్తుంది. మా ఇంటావిడ సంగతే. భర్త సంపాదన తనకి తెలీకపోతేనా? 74 రూపాయలు జీతగాని భార్య. కోర్కెల దేవతా కోరికలు. ప్రతి పండక్కి చీర కొనాలట. అమ్మాయికి గౌనులు. పక్కింటి పిల్ల ఏగౌను కొనుక్కుంటే అదే గౌను మన అమ్మాయికి. వాళ్ళతో పంతుకు పోతే మనం నెగ్గగలమా అనే ఆలోచన పూజ్యం.

అబ్బబ్బ! ఇది ఒకటే అయితే బాధ పడనవసరంలేదు. కానీ... కానీ... ఇంకా ఎన్నో ప్రతి పుట్టినరోజు పండగ పాపకి ఎంతో వైభవంగా చెయ్యాలట. పది మందినీ పిల్చి వేడుగ్గా చేసుకుందాం? "వద్దు" అనగానే ఇహ రంకెలూ, బెదిరింపులూ, హుంకారాలు.

అందరూ రేడియోలు కొనుక్కుంటున్నారు. మనంకూడా కొనుక్కుందాం. అప్పుడప్పుడు కొంత కట్టాలంటే కస్సుబుస్సు ఇస్తారట...... అంటూ మొదలు!

రేడియోలు గ్రామ ఫోనులు ఇహ చూడండి రాణి కోరికలు. ఏ అంతస్థులో వుండే వాళ్ళ కాపురం అక్కడే అనే జ్ఞానం లేదుగదా! మరి తెలిసే అడుగుతోందో లేక అగమ్యగోచరమనుకుని అంటోందో?

ఏ పనీ పూర్తి కాలేదని ఆఫీసరు చేత నాలుగు చివాట్లు తిని ఆరు కాగానే ఆఫీసు గడప దాటి వచ్చేశాడు ఇంటికి.

ఇల్లు చేరుకోగానే వాకిట్లోనే భార్య ఎదురుగా వచ్చి ఖాళీ చేతులు గమనించి, గిరుక్కుమని వెనక్కి తిరిగి వెళ్ళిపోయి, "పోషించ శక్తి హీనమయినపుడు పెళ్ళి చేసుకుని భార్యా బిడ్డల్ని హింస పెట్టడంలో తెలివిగల పని అను కోవడం ఎంత బుద్ధి లోపం!... ఎంత అజ్ఞానం! చాత కానపుడు అలాగే వుండాలి. గొప్పలకు పోవడం చాత గాని కార్యం!" అని అక్కస్సు వినపడేలాగునే అంది.

"ఏమిటే నీ గొణుక్కు?"

"పాలడబ్బా సంగతి ఏమిటి? తెచ్చారా!" గట్టిగానే అంది.

"బాగా కనుక్కున్నావు లేదు"

"ఎందుకు కన్నారు?" తొందరపడే అన్నట్టుంది.

"నేను కాదుగా!" వికారంగా నవ్వుతూ అన్నాడు.

"గొప్ప చదువులుంటే ఈమాదిరి ప్రవర్తన ఉండదు. కేవలం నా ఖర్మ!"

"అది నా లోపంకాదు. నీ లోపమే!"

"ఇంతకీ అమ్మాయి గతిఏమిటి? దాన్ని ఇద్దరమూ కలిసి చంపేద్దామా? చెప్పండి"

"ఎందుకూ?"

"మళ్ళీ మొదలా! పాల..."

పెద్ద నవ్వు నవ్వుతూ, "రాజ్యం! తల్లివి-కన్నతల్లివి నీవు బతికి వుండగా పాల విషయంలో నీ బిడ్డకు నేనా బాధ్యత? పిచ్చిదానా! కన్నకూతురికి పాలు ఇచ్చుకో. పాలిచ్చి ప్రాణం పోసుకో. నన్ను వేధించకు. పాలిచ్చుకో! పాలిచ్చుకో బతికించు. తల్లివి నీవు వున్నావు......... హా! ఇవ్వు......" అని ముందుకు వచ్చాడు.

భర్తకు మెదడు మారిపోలేదుగదా! పీక పీకెయ్యాడు గదా అనుకుంటూ వణుకుతోంది ఆ స్త్రీ!!

---